# కుమ్మెర ఘటనపై ముల్కనూరులో నిరసన జ్వాలలు





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి26 (జర్నలిస్ట్ వార్త):** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా రజక, దళిత కుటుంబాలపై జరిగిన పాశవిక దాడిని ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ సెంటర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కుమ్మెరలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా దర్శనానికి వెళ్లిన దళిత రజక కుటుంబాలకు చెందిన వారిని కొంతమంది కుల దురహంకారంతో గుడిలోకి రానీయకుండా అడ్డుకోవడం అమానుషమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఒక చిన్నారి మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై హత్యా కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, బలహీన వర్గాలపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

# పాఠశాలలకు రూ.22 లక్షల ప్రహరీ గోడ

## వేలేరు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో శంకుస్థాపన



**వేలేరు,/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 26 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో ప్రహరీ గోడ లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు సర్పంచ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా, ఆయన వెంటనే మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 22 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. గ్రామ సమస్యలు తెలిసిన వెంటనే స్పందించి పరిష్కారం చూపడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. పారదర్శక పరిపాలన అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాలపల్లె సర్పంచ్ కూరపాటి అశోక్, లోక్యతండా సర్పంచ్ సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంపత్, ఉపసర్పంచ్ శ్రీకర్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, మండల ఏపీఓ, పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్, ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ వీరాంజనేయ స్వామి జీవధ్వజ శిఖర ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహణ



**వైరా/ఫిబ్రవరి 26 (జర్నలిస్ట్ వార్త):** వైరా మండల పరిధిలోని కేజీ సిరిపురం గ్రామంలో వడ్లమాని సుబ్రమణ్యం ఆధ్వర్యంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో జీవధ్వజ శిఖర ప్రతిష్టా మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత వాయిద్యాలు, మేళతాళాలు, గోపూజల నడుమ అర్చకుల సారథ్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కందిబండ కుటుంబ సభ్యులు జీవధ్వజ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, జిల్లా అర్చకులు, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# బీఆర్ఎస్ నాయకుడు పోగులకొండ వేణును పరామర్శించిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి/ఫిబ్రవరి 26 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రానికి చెందిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ మండల నాయకుడు పోగులకొండ వేణు ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం ఆయనను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ తరఫున అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, లేతాకుల రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, సంకినేని ఎల్లస్వామి, ఎండీ అక్బర్, ఎనగందుల యాదగిరి, బల్లెం యాదగిరి, ఉబ్బని సింహాద్రి, పెద్దగోని జీవన్, చందు లక్ష్మన్, ఐత జంపి, ఉబ్బని కిషోర్, మహేందర్, ఐత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన స్నేహితులు



**తల్లాడ/ ఫిబ్రవరి 26 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నల్లగట్ల ప్రసాద్ వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా వధూవరులకు స్నేహితులు హాజరై హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నార పోగు విజయ్, వారాల వంశీ, నల్లగట్ల కిషోర్, మానుపాటి మధు తదితరులు పాల్గొన్నారు.



# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



**మధిర /ఫిబ్రవరి 26 (జర్నలిస్ట్ వార్త):** నియోజకవర్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు. పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని ఆమె పేర్కొన్నారు. మధిర పట్టణంలో సేఫ్ తల్లిపిల్లల హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాతతో కలిసి తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణం అందించాలంటే చెట్లను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పట్టణ పెద్దలు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు తప్పదు


## : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న



**నర్సంపేట/ఫిబ్రవరి 26 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు చెన్నారావుపేట మండలంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో ముగ్గురిని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుండి సస్పెండ్ చేస్తున్నట్లు చెన్నారావుపేట మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న ప్రకటించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ కంది శ్వేతా, కంది కృష్ణ చైతన్య, కార్యకర్త జున్నుతుల మహేందర్ రెడ్డి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా బాల్నే వెంకన్న మాట్లాడుతూ, అధికార పార్టీలు చూపే ప్రలోభాలకు లొంగి రాజకీయ భవిష్యత్తు కల్పించిన పార్టీని వీడటం శోచనీయమన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచే వారికి బీఆర్ఎస్‌లో స్థానం ఉండదని స్పష్టం చేశారు. తరచుగా పార్టీలు మారే వారికి ఎక్కడా రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, అయితే క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, మండల ఉపాధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల సమక్షంలో ఘనంగా వివాహ వేడుకలు





**రాయపర్తి/ఫిబ్రవరి 26 (జర్నలిస్టు వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గ్రామ పార్టీ అధ్యక్షుడు లక్కం కుమార్ కుమార్తె హారికహరీష్, మైలారం గ్రామానికి చెందిన తాళ్ల నర్సింహారెడ్డి కుమారుడు అశోక్‌రెడ్డిసుష్మిత, శివరామపురం గ్రామానికి చెందిన బొరిగం సుధాకర్ కుమార్తె సుప్రియవిష్ణుకుమార్‌ల వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వివాహ కార్యక్రమాలకు గురువారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపల్లి సంతోష్ గౌడ్, లేతాకుల రంగారెడ్డి, బొమ్మరబోయిన మహేష్, చెడుపాక కుమార్, గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, ఐత రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీసీలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## హనుమకొండ ఏపీడీ బొజ్జ వెంకటేశ్వర్లు







**కాజీపేట/ఫిబ్రవరి26(జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ లో పనిచేస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా పేద మహిళలకు నాణ్యమైన సేవలు అందించాలని హనుమకొండ ఏపీడీ బొజ్జ వెంకటేశ్వర్లు సూచించారు. కాజీపేటలోని బాలవికాస భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సీసీలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి అంశాలపై నిర్వహిస్తున్న నాలుగు రోజుల రిఫ్రెష్‌మెంట్ శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అర్హత గల స్వయం సహాయక సంఘాలకు సకాలంలో బ్యాంక్ రుణాలు అందేలా చూడటంతో పాటు, వంద శాతం రికవరీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం సీసీలు నిరంతరం కృషి చేయాలని కోరారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న సీసీలకు ఏపీడీ సర్టిఫికెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ప్రతినిధి బ్యాంకు లింకేజీ డీపీఎం, దామోదర్, అనిత ఐబీడీపీఎం దయాకర్ ఏపీఎంలు మహేందర్ జయసుధ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సీసీలు గోలి కొమురయ్య లవ కుమార్, రవీందర్ సుజాత సుమలత శోభ శ్యామ్ ఏలియా వీరారెడ్డి విజయలక్ష్మి నాగేష్ ప్రభాకర్ ములుగు జనగాం మహబూబాబాద్ భూపాలపల్లి వరంగల్ హనుమకొండ జిల్లాల సీసీలు బ్యాంకు లింకేజీ విభాగం అడ్మిన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

